ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా
ఫుట్‌పాత్ షాపుల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర క్రమబద్ధీకరణలో భాగంగా సూచించిన స్థలాల్లోనే చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను సాగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది ఆదివారం నగర ప్రధాన వీధుల్లో క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న కూరగాయలు, పండ్ల వ్యాపారులను అక్కడి నుంచి తరలించారు. వారికి సూచించిన స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించరాదని అవగాహన కల్పించారు. ప్రధాన రహదారులు కావడంతో ప్రజల రాకపోకలు, వాహనాల రద్దీ అధికంగా ఉంటాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని రహదారి క్రమబద్ధీకరణకు సహకరించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు. అందరి సమిష్టి కృషితోనే అందమైన నగరంగా తీర్చిదిద్దవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కోరెడ్ల విజయగౌరి.. పోరాటాల్లో శివంగి

ఉపాధ్యాయ ఉద్యమాల్లో గర్జించే శివంగి... మహిళా ఉద్యోగుల పెన్నిధి... సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన మేధావి... పాలకపార్టీల కుతంత్రాలను నిర్భయంగా నిలదీసే నేత... బాలికల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు పల్లెబాట పట్టిన వనిత. ఆమె ఎవరో కాదు. ఉత్తరాంధ్రా ఉపాధ్యాయ లోకానికి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని కోరెడ్ల విజయగౌరి. ఉపాధ్యాయ ఉద్యమంలో టక్కున గుర్తుకు వచ్చేది ఈమె పేరే. బహుసా అందుకేనేమో శాసనమండలిలో రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వాలని నిక్కచ్చిగా నిలదీసే పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఆమె పోరాట పటిమ ఒకసారి పరిశీలిస్తే.., నిర్బంధాలు, కేసుల నడుమ ఆమె సాహస పోరాటాలు, విజయాలు ప్రస్ఫుటిస్తాయి.

- ఉపాధ్యాయ నేతగా ఎన్నో సమస్యలకు పరిష్కారం
- అక్రమ కేసులు, నిర్బంధాలు లెక్కచేయని వైనం
- మండలి బరిలోనూ అదే దూకుడు
- నిక్కచ్చిగా నిలదీసే పిడిఎఫ్ తరపున పోటీ

ఐటిడిఎ వద్ద దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి (ఫైల్)

ఐటిడిఎ వద్ద రాత్రిపూట వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పార్వతీపురం

సుమారు 33 ఏళ్ల క్రితం కోరెడ్ల విజయగౌరి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం పనిచేయడమే ఆమె చరిత్ర. ఆమె చేపట్టిన పోరాటాలు, విజయాలు, నిర్బంధాలు, అక్రమ కేసులు ఒకసారి పరిశీలిస్తే...

☞ రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటి వాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు విజయగౌరి చొరవ చూపారు. ఆ మేరకు ఉత్తరాంధ్ర జిల్లాలు, ముఖ్యంగా ఏజెన్సీల్లో పాఠశాలల మూసివేత తగ్గింది. పోరాటాల ఫలితంగా కొన్ని పాఠశాలల పునరుద్ధరణ కూడా జరిగాయి.

☞ జిఒ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేసి తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు.

☞ గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నడిపిన ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్‌టిల రెన్యువల్, రెగ్యులరైజేషన్ వంటి వాటి కోసం విజయగౌరి పోరాటం.. ఉపాధ్యాయ ఉద్యమంలో మరిచి పోలేనిది.

☞ గిరిజన సంక్షేమ పాఠశాలల ప్రధానో పాధ్యాయుల అధికారాల తొలగింపునకు సంబంధించిన జిఒ 132 రద్దు కోసం అవిశ్రాంత పోరాటం చేశారు. ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్ష శిబిరంలో రాత్రి బస చేశారు. చివరకు ప్రభుత్వం దిగొచ్చి ఆ జిఒను రద్దు చేసింది.

☞ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్, రెగ్యులరైజేషన్ కోసం జరిగిన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు.

☞ 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన అక్రమ కేసు ఏడేళ్లపాటు నడిచింది.

☞ 2017లోనే ఉపాధ్యాయుల వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయాలని యుటిఎఫ్ తనదైన శైలిలో పోరాటం నడిపింది. చివరికి నాటి వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేసి మాన్యువల్ కౌన్సిలింగ్‌ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పోరాటంలో కీలకపాత్ర పోషించిన విజయగౌరిపై అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. ఆ కేసును ఎదుర్కోవడానికి ఆమె కోర్టు చుట్టూ ఏడేళ్లపాటు తిరిగారు. అయినా సరే, విజయగౌరి వెరవలేదు. మరింత మొక్కవోని దీక్షతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో ఎక్కువమంది ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. విజయానికి సానుకూల అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

వైఎస్‌ఆర్ స్పందించేలా

2005లో 300 మంది ఉపాధ్యాయుల అక్రమ బదిలీల నిలుపుదల కోసం విజయగౌరి పోరాడారు. ఆ క్రమంలో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి.. నేడు మన్యం జిల్లాలో భాగంగా ఉన్న జంఝావతి ప్రాజెక్టు రబ్బర్ డ్యామ్ ప్రారంభానికి వచ్చినప్పుడు పోలీసుల వలయం నుంచి తప్పించుకుని మరీ సభాస్థలి వద్దకు చేరుకుని ప్లకార్డుతో పెద్దపెట్టున నినాదాలు చేయడంతో అధికార యంత్రాంగం అవాక్కైంది. ఉలిక్కిపడ్డ అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ బయటకు పంపేందుకు పోలీసులను ఉసిగొల్పినప్పటికీ, నాటి సిఎం వైఎస్‌ఆర్ ఎంతో హుందాగా విజయగౌరిని వేదికపై రప్పించడంతోపాటు బదిలీలు రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించారు.

హెచ్‌ఎం కుర్చీలో కూర్చుని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు(ఫైల్)

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన
టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అధికార టిడిపి విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోందని, వెంటనే ఆ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస.. ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టిడిపి నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన చిత్రాలను ఆయన విడుదల చేశారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఒక హైస్కూల్‌కు వెళ్లి, ఏకంగా ప్రధానోపాధ్యాయుల కుర్చీలో కూర్చుని టిడిపి బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని అక్కడి ఉపాధ్యాయులకు చెప్పడం ఎన్నికల కోడ్ ఉల్లంఘించరనడానికి ప్రత్యక్ష ఉదాహరణని పేర్కొన్నారు. అధికారులు దీనిపై ఏమాత్రమూ చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించారు. అధికారులు అలసత్వంతో ఉంటే పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ఇటువంటి ఉల్లంఘనలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఎన్నికల ఏజెంట్ లేఖ రాసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి సేతు మాధవన్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగింది. 12 కేంద్రాల్లో 84.69 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ జెఎన్‌టియు, సీతం కేంద్రాలను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతించారు. సమయానికి ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్దకు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపట్టారు.

సీతం విద్యార్థులకు ఆప్తా స్కాలర్‌షిప్

ప్రజావక్తి-విజయనగరం

అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను పంపిణీ చేసే కార్యక్రమం ఆదివారం విశాఖపట్నంలోని ఐఐఎంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతం కాలేజీ విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను ఆప్తా ప్రతినిధులు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులను సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి అభినందించారు.

నన్ను గెలిపిస్తే ప్రతి ఉపాధ్యాయుడూ గెలిచినట్టే

- పిఆర్‌సి, డిఎలు ఇవ్వని వారికి ఓట్లు అడిగే హక్కులేదు
- పెద్దల సభ ఔన్నత్యాన్ని కాపాడండి
- పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి; చిత్రంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

'నన్ను గెలిపిస్తే ఉత్తరాంధ్రలో ప్రతి ఉపాధ్యాయుడూ గెలిచినట్టే... ఇప్పటి వరకు తనకు ఏ పదవీ లేకపోయినా యుటిఎఫ్‌లో నాయకురాలిగా ఉపాధ్యాయ సమస్యలపై 33 ఏళ్లుగా పోరాటం చేసి చూపించాను. ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ఉపాధ్యాయుల తరపున మరింత గళం వినిపించేందుకు అవకాశం ఉంటుంది' అన్నారు.. పిడిఎఫ్ తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన కోరెడ్ల విజయగౌరి. శాసన మండలిలో స్వతంత్రంగా పనిచేసేవారు అవసరమని, అందుకు భిన్నంగా పాలకపార్టీలు రాజకీయ రంగు పులుముతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పెద్దలసభ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన అవసరం, బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిఆర్‌సి, డిఎ ఎరియర్స్ వంటి ఆర్థిక అంశాలపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేని వారికి, చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయని వారికి ఉపాధ్యాయ ఓట్లు అడిగే హక్కులేదని ఆమె అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.

గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసినవారు సమస్యలను గాలికి వదిలేసి, ప్రభుత్వాలకు అనుగుణంగా వ్యవహరించడం వల్ల ఉత్తరాంధ్రా నుంచి ఉపాధ్యాయుల గొంతు రాష్ట్రంలో వినిపించలేదని అన్నారు. ఈ నేపథ్యంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో శాసన మండలి సభ్యునిగా పిడిఎఫ్ తరపున పోటీచేసే అవకాశం దక్కిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం శాసన మండలిలో పిడిఎఫ్ నిలదీస్తున్నందున పాలకపార్టీ వెన్నులో వణుకు పుట్టిందని, అందుకే తమకు అనుకూలంగా ఉండేవారిని బలపరుస్తూ ఉపాధ్యాయులను తప్పుదారి పట్టిస్తున్నారని వివరించారు. తనకు అవకాశం కల్పిస్తే విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల రక్షణ కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వాలు విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ప్రాథమిక, ఉన్నత విద్యలో ఇప్పటికే నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో 117 జిఒను రద్దు చేయాలని యుటిఎఫ్ బయట, శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పెద్దఎత్తున పోరాటం చేసినట్లు తెలిపారు. చట్టసభల్లో ప్రశ్నించేవారు లేకుండా చేసేందుకు పాలకపార్టీలు పావులు కదుపుతున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగానే గత నెలలో జిఒ 117ను రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించి, తిరిగి అదే విధానాలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్లస్2 వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించినప్పటికీ ఫౌండేషన్ క్లస్టర్ పాఠశాల కేంద్రీకరణ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం కోసం, ప్రభుత్వ విద్యా రంగాన్ని నష్టం చేసే సంస్కరణలకు వ్యతిరేకంగా మీ గొంతుకై నిలబడతానని హామీనిచ్చారు. సిపిఎస్ రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

ఆర్థిక పరమైన అంశాలు పిఆర్‌సి, డిఎలు లేవని, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.25 వేల కోట్లు ఇవ్వలేదని తెలిపారు. వీటి కోసం, ఐఆర్, డిఎల సాధనకు పోరుబాట ద్వారా కృషి చేస్తానని తెలిపారు. ఒకే యాప్‌లో 40 యాప్‌లు ఇమిడ్చే ప్రయత్నం నేటి కూటమి ప్రభుత్వం చేస్తుందని, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీన పర్చే యాప్‌ల వ్యవస్థ రద్దు కోసం పోరాడతానని చెప్పారు. వివిధ రకాల యాజమాన్యాల కింద పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కెజిబివి ఉపాధ్యాయులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందన్నారు. వారికి హెచ్‌ఆర్ పాలసీ, మినిమం టైం స్కేల్ కోసం, మోడల్ స్కూల్ సర్వీస్ రూల్స్ సాధనకు పోరాటం చేస్తామని చెప్పారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో పని చేసే ఉద్యోగులకు సంక్షేమ నిధి, హెల్త్ ఇన్సూరెన్స్, ఉద్యోగ విరమణ అనంతరం పింఛను అమలుకు పోరుబాట సాగిస్తామని తెలిపారు. ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఒకేషనల్ వంటి టెక్నికల్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులర్ కోసం పోరాడుతామన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేసే ఎన్ఇపి రద్దు కోసం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని, మీకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో ఆదరణ బాగుందని, పిడిఎఫ్ విజయానికి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, నాయకులు సిహెచ్.తిరుపతినాయుడు, ఎన్.సత్యనారాయణ, కె.అప్పారావు, పి.రాంప్రసాద్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మూడు లాంతర్ల కూడలిలో డ్రోన్‌తో నిఘా పెట్టిన పోలీసులు

డ్రోన్లతో నేరాలకు చెక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో డ్రోన్ల వినియోగం ద్వారా నేరాలకు చెక్ పెడుతున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న శివారు, రద్దీ ప్రాంతాల్లో, పండగల్లో నిఘా పెట్టేందుకు, ఈవ్ టీజింగ్, ఓపెన్ డ్రింకింగ్, కోడి పందాలను, చైన్ స్నాచింగ్స్‌ను నియంత్రించేందుకు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నేరాలను నియంత్రించుటకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, డ్రోన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, కోడి పందేలు, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, పండగల్లో రద్దీని క్రమబద్ధీకరించేందుకు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, తోటలు, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్లను పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడులను నియంత్రించేందుకు డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని జెఎన్‌టియు., కలెక్టరేట్ జంక్షన్, కె.ఎల్.పురం, మయూరి కూడలి, ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషను, తోటపాలెం, బాలాజీ జంక్షన్ వంటి ప్రాంతాలు, కళాశాలల వద్దకు వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్లు పంపి, నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజను ప్రాంతాల్లోనూ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో డ్రోన్లను వినియోగిస్తూ ఓపెన్ డ్రింకింగ్ చేసిన వారిపై 3400 కేసులు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 907 కేసులు నమోదు చేశామని తెలిపారు.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం

కెజిబివిలో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాల కల్పన ● 'ప్రజాశక్తి'తో సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు ముఖాముఖి

'కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో రానున్న పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ప్రతి విద్యార్థీ ఉద్యోగ అవకాశాలు పొందేలా వారిలో నైపుణ్యాలు పెంచేలా నాణ్యమైన విద్యనందిస్తున్నాం. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నా'మని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.రామారావు వెల్లడించారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో మెరుగైన ఫలితాల కోసం తీసుకున్న చర్యలు, విద్యార్థి కేంద్రంగా చేపడుతున్న కార్యక్రమాలు గురించి వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం టౌన్

? ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు.?

ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 26 కెజిబివిల నుంచి 971 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 837 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 641 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కానున్నారు. పదో తరగతిలో 90 నుంచి 100 శాతం ఫలితాలు సాధించాలని, ఇంటర్‌లో 90 శాతం ఫలితాలు సాధించాలని లక్ష్యం. ఇప్పటికే ఆ దిశగా చర్యలు తీసుకున్నాం. సబ్జెక్టు టీచర్లకు దిశానిర్దేశం చేశాం.

? నూరు శాతం ఫలితాలు రాబట్టేందుకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

నూరు శాతం ఫలితాలు రాబట్టేందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. రెండు నెలల క్రితం వరకు పూర్తి అయినా పాఠ్యాంశంపై పరీక్ష నిర్వహించడం, ప్రతిరోజూ అదనంగా తరగతులు నిర్వహించి, చదివించడం వంటి చర్యలు తీసుకున్నారు. వివిధ రకాల పరీక్షల్లో పదిలో 90 శాతం ఫలితాలు, ఇంటర్‌లో 80 శాతం ఫలితాలు వచ్చేలా విద్యార్థులు సంసిద్ధులయ్యారు. దీనిని మరింత పెంచేందుకు 100 రోజులు ప్రణాళిక, ఫిబ్రవరిలో 14 రోజుల ప్రణాళిక అమలు చేశాం.

? వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారా.?

ఇప్పటికే అనేక పరీక్షలు నిర్వహించడం ద్వారా, ప్రీ ఫైనల్ పరీక్షలో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన సబ్జెక్టుల్లో మార్కులు పెంచడమే లక్ష్యంగా 14 రోజుల ప్రణాళిక అమలు చేశాం. ప్రధానంగా గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో కొంతమంది విద్యార్థినులు వెనుకబడి ఉన్నారు. వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

? ఆంగ్ల మాధ్యమంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరా.?



వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు మొన్నటి వరకు తెలుగు మీడియంలో చదివిన వారు. అయినప్పటికీ ప్రతి విద్యార్థినీ ఇంగ్లీష్‌లో మాట్లాడటం ద్వారా, ఆంగ్లంలో చదివి అర్థం చేసుకొనే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ఆంగ్ల మాధ్యమంలో వారిని పరీక్షలు రాసేందుకు సిద్ధం చేశాం. ఉపాధ్యాయులను కూడా అందుకు అనుగుణంగా తయారు చేసి, శిక్షణ ఇచ్చాం.

? ఇంగ్లీష్‌పై పట్టు కోసం తీసుకున్న చర్యలేమిటి.?

నేను ఎపిసిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధానంగా ఆంగ్లంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడుకునేలా తయారు చేయాలని నిర్ణయించాను. రాష్ట్రంలోనే తొలిసారిగా ఆంగ్లంలో ఉపాధ్యాయులకు ప్రతిరోజు సాయంత్రం 6.15 గంటల నుంచి 7.15 గంటలు వరకు ఆన్‌లైన్‌లో నేనే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను. వచ్చే విద్యా సంవత్సరం నాటికి 100 రోజుల్లో కెజిబివి ఉపాధ్యాయులంతా ఇంగ్లీష్‌లో మాట్లాడటం, బోధించడం లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఉపాధ్యాయులను తీర్చిదిద్దితే అది విద్యార్థులకు బోధనలో ఉపయోగపడుతుంది. మన కార్యక్రమాన్ని అభినందించి, ఈ విధానం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అమలు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు చెప్పారు.

? కెజిబివిల్లో మెనూ అమలు ఎలా ఉంది.?

ఇప్పటి వరకు 18 కెజిబివిలను సందర్శించాను. విద్యార్థినులకు మెనూ చాలా బాగా అమలవుతోంది. నేను వెళ్లిన ప్రతి కెజిబివిలో విద్యార్థులతో కలిసి ఆహారం తీసుకున్నాను. జనవరి నుంచి ఒక్కో విద్యార్థికి మెస్‌ఛార్జీ రూ.1400 నుంచి రూ1600కి పెంచారు. మరింత నాణ్యతగా విద్యార్థులకు మెనూ అమలు చేసే అవకాశముంది. మెనూ అమల్లో రాజీ పడేది లేదు.

? సమగ్ర శిక్ష ద్వారా మెరుగైన సేవలందించేందుకు చేస్తున్న కృషి ఏమిటి.?

సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థులకు సేవలు అందించేందుకు వంద శాతం కృషి చేస్తున్నాం. మౌలిక సదుపాయాలు కల్పించడం, కెజిబివి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లక్ష్యంగా చేసుకొని వారిలో స్కిల్ డెవలప్‌మెంట్ విద్యా విధానం అమలు చేస్తున్నాం.

గడువులోగా పూర్తి చేయాలి: పీడీ

ప్రజాశక్తి- రాజాం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్షణాలను గడువులోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ శారదా దేవి అన్నారు. పథకం అమలు తీరుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కస్టర్స్ సమావేశం నిర్వహించారు. క్లస్టర్ వారీగా పని దినాలు, చేపడుతున్న పనులు, మహిళా శక్తి ఉపాధి భరోసా, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి- వేపాడ

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఉద్యమ నేత, హక్కుల కోసం నిత్యం పోరాడే విజయగౌరిని గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్ కోరారు. ఆదివారం యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆయన బొద్దాం, కొత్త బొద్దాం ఒబలయ్యపాలెం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ప్రయివేటు ఉపాధ్యాయ ఓటర్లను కలిసి వారికి వేతన బోర్డు సాధన, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, హెల్త్ కార్డుల మంజూరు ప్రత్యేక ఫంక్షన్ స్కీమ్‌కి కృషి, ఉద్యోగ భద్రత వంటివి విజయగౌరితోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటును ఆమెకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఇమంది జగదీశ్వరరావుతో, ఎం.సతీష్ ఉపాద్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ, శశిభూషణ్, కె.రామకృష్ణ, సుధాకర్, కేశవ్ ఆదివారం పట్టణంలో ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు హక్కులు, విద్యారంగ పరిరక్షణకు విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లిలో గత రెండు రోజులుగా జరుగుతున్న సంతాన సుబ్రహ్మణ్యస్వామి, అభయ ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 9 బళ్లు పాల్గొని తలబడ్డాయి. మొదట విజేత గండి వెంకట్రావు (వావిలిపాడు)కు రూ.15వేలు, రెండవ విజేత సిద్ధి వినాయక (వల్లంపూడి)కు రూ.13వేలు, మూడో విజేత గుమ్మాలమ్మ తల్లి (కృష్ణరాయుడుపేట) ఎడ్ల బండికి రూ.10 వేలు నగదు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన్ స్లో బైక్స్ పోటీల్లో విజేతలకు కూడా గ్రామ పెద్దలు, సర్పంచ్ కోలా సతీష్, ఉత్సవ కమిటీ చేతుల మీదుగా నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌బేబి డ్యాన్స్ ఆకట్టుకున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆ నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను, పూర్వ విద్యార్థులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి, వారి ప్రవర్తన తీరు, గురువులు పట్ల వారికి ఉన్న అభిమానం చూస్తుంటే భయ మేస్తోందన్నారు. ఉన్నత విలువులు లేకపోవటమే కాకుండా వారి భవిష్యత్ ఎలా ఉంటుందో అర్థం కావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సందర్భంలో ఎప్పుడో 'మాదగ్గర చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు మమ్మల్ని గుర్తు పెట్టుకొని ఆహ్వానించి సన్మానించటం అంటే మా పూర్వ జన్మ సుకృతమే' అని అన్నారు. ఆనాటి విద్యార్థులు మాట్లాడుతూ తమ గురువులు తమకు నేర్పిన డిసిప్లెన్, తమ భవిష్యత్‌కు పునాదిగా మారిందన్నారు. అనంతరం ఆటపాటలతో ఉత్సాహ భరితంగా గడిపారు.

చేపల మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి - బొబ్బిలి

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చేపలకు మంచి డిమాండ్ పెరిగింది. ఈ వ్యాధి భయంతో బ్రాయిలర్ చికెన్ అమ్మకాలు తగ్గడంతో చేపల అమ్మకాలు బాగా పెరిగాయి. చేపల అమ్మకాల షాపులు ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మటన్ అమ్మకాలు కూడా బాగా పెరిగాయి. చికెన్ అమ్మకాలు తగ్గడంతో కోళ్ల ఫారం వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడగా చేపలు, మటన్ అమ్మకాలు పెరగడంతో ఆయా వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి, జనసేన కార్యకర్తల కొట్లాట

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పెదబూరాడపేటలో టిడిపి, జనసేన కార్యకర్తల మధ్య ఆదివారం రాత్రి కొట్లాట జరిగింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. పెదబూరాడ పేటలో గుడ్ మార్నిగ్ జనసేన కార్యక్రమం నిర్వహిస్తుండగా రేషన్ డీలర్ నియామకంపై జనసేన, టిడిపి మధ్య ఘర్షణ జరిగింది. 20 సంవత్సరాలగా రేషన్ షాపు డీలర్‌గా సేవలందించిన టిడిపి వ్యక్తికి కాకుండా ఇటీవల చేపట్టిన డీలర్ నియామకంలో జనసేన వ్యక్తికి డీలర్ పోస్టు కేటాయించడంతో ఈ ఘర్షణ జరిగినట్లు చెబుతున్నారు. ఈ ఘర్షణలో రెండు గ్రూపులకు చెందిన కార్యకర్తలకూ గాయాలయ్యాయని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లారని గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని ఎస్ఐ గణేష్ తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - గుర్ల

రెప్పపాటులో పెను ప్రమాదం తప్పింది. నిమిషం ఆగి ఉంటే ఆ నలుగురు అగ్నికి ఆహుతి అయ్యేవారు. ప్రమాదం తప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో గరికవలస గ్రామం దాటిన వెంటనే గెడ్డ వాగు వద్ద ఆదివారం గడ్డి ట్రాక్టర్ అగ్నికి ఆహుతి అయింది. గజపతినగరం మండలం ముచ్చర్ల నుంచి భోగాపురం ట్రాక్టర్ మీద గడ్డి ఎక్కించుకొని వెళు తుండగా ఈ ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం గరికవలస వచ్చేసరికి హై వోల్టేజ్ వైర్లు పై నుంచి ఉండటంతో ఒక్కసారిగా నిప్పులు చిలరేగి గడ్డికి నిప్పు అంటుకుంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు చల్లా చెదరై ఆందోళనతో పరుగులు పెట్టారు. ట్రాక్టర్‌పై ఉన్న గడ్డి కాలుతుండగా కిందకు దిగేందుకు భయపడుతున్న కూలీలకు చెట్టుకొమ్మ దొరకడంతో అది పట్టుకుని కిందికి దిగిపోయారు. కొద్ది క్షణాల్లోనే గడ్డి మొత్తం బూడిదైపోయింది. ఈ ట్రాక్టర్ డి.లచ్చన్న అనే రైతు గడ్డి కొనుగోలు చేసి భోగాపురం తీసుకెళ్తున్నాడు. ప్రమాదం సంభవించిన వెంటనే గరివిడి ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

తలగాంలో గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి- వంగర

మండలంలోని తలగాంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన వావిలపల్లి సుగుణమ్మ సుమారు 6 ఎకరాలకు సంబంధించిన గడ్డివాము గ్రామ సమీపంలో నిల్వ చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ పడేయడంతో మంటలు చెలరేగాయి. ఈ సమాచారం తెలుసుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది వాహనంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఎయిర్ పోర్టుకు మరో రోడ్డు

● గుడివాడ నుంచి కొత్తగా మాస్టర్ ప్లాన్ రోడ్డు మంజూరు ● సుమారు 60 ఎకరాల భూ సేకరణ ● సచివాలయాల వద్ద నోటిఫికేషన్ ప్రతులను అంటించిన అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం

విశాఖ మెట్రోపాలిటిన్ రీజియన్ డెవలప్‌మెంటు అథారిటీ (విఎమ్ఆర్‌డిఎ) మాస్టర్ ప్లాన్ 2041లో భాగంగా మండలంలో 30 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. గుడివాడ నుంచి ఎ.రావివలస జగనన్న కాలనీ వద్ద నిర్మిస్తున్న విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు సర్కిల్ వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. ఈ మేరకు సుమారు 60 ఎకరాల భూమిని గుడివాడ, పోలిపల్లి, రావాడ, ఏ.రావివలస రెవెన్యూ గ్రామాల్లో సేకరించనున్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల వద్ద సర్వే నెంబర్లుతో సహా నోటిఫికేషన్‌ను విఎమ్ఆర్‌డిఎ అధికారులు అంటించారు. అభ్యంతరాలను 15 రోజుల్లో తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీంతో మళ్ళీ రైతుల్లో ఆందోళన మొదలైంది.

మాస్టర్ ప్లాన్ 2041లో భాగంగా మండలంలో మొట్టమొదటి రహదారికి విఎమ్ఆర్‌డిఎ శ్రీకారం చుట్టింది. గుడివాడ గ్రామం నుంచి జాతీయరహదారిపై ఉప్పాడపేట జంక్షను నుంచి విమానాశ్రయానికి వెళ్ళేందుకు కొత్తగా నిర్మిస్తున్న రహదారికి ఈ మాస్టర్ ప్లాన్ రహదారిని అనుసంధానం చేయనున్నారు. దీంతో తగరపువలస వైపు నుంచి వచ్చే వారు నేరుగా ఈ రహదారి నుంచి ఎటువంటి ట్రాఫిక్ సమస్యా లేకుండా విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అందుకు ఈ రహదారిని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ రహదారిని వేగంగా నిర్మించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సుమారు 8 కిలోమీటర్ల రహదారిని 30 మీటర్లు వెడల్పుతో నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషనన్ను ఈ నెల 17వ తేదీన జారీ చేశారు.



సచివాలయం వద్ద విఎంఆర్‌డిఎ అధికారులు అతికించిన నోటిఫికేషన్

రావాడ, పోలిపల్లిలోనే ఎక్కువ భూములు

మండలంలోని గుడివాడ, పోలిపల్లి, రావాడ, ఏ.రావివలస రెవెన్యూ గ్రామాలతో పాటు విశాఖ జిల్లా చిప్పాడ రెవెన్యూ పరిధిలో ఒక సర్వే నెంబరులో భూములను సేకరించనున్నారు. ఇందులో అత్యధికంగా రావాడ, పోలిపల్లి రెవెన్యూ గ్రామాల్లోనే రైతులు భూములు కోల్పోవలసి వస్తుంది. ముఖ్యంగా జాతీయరహదారి నుంచి అవంతి కళాశాల మీదుగా చిప్పాడ వెళ్ళే రహదారిలో గుడివాడ గ్రామం వద్ద నుంచి ఈ రహదారి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి చిప్పాడ రెవెన్యూలో ఒక సర్వే నెంబరు ఉంటుంది. అనంతరం పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని ఏటిపోలం మీదుగా అమనాం పక్క నుంచి రావాడ రెవెన్యూలో నుంచి వెళ్తుంది. రావాడ పరిధిలోని చెరువు పక్కన ఉన్న హుదూద్ ఇండ్ల పక్క నుంచి రావాడ గొల్లపేట గ్రామాల మీదుగా ఏ.రావివలస రెవెన్యూలోకి వస్తుంది. అక్కడ ఏ.రావివలస జగనన్న కాలనీ సమీపంలో నిర్మిస్తున్న విమానాశ్రయానికి వెళ్ళే రోడ్డుపై సర్కిల్ వద్దకు వచ్చి కలుస్తుంది. ప్రస్తుతం రైతులకు ఇంకా ఈ భూసేకరణకు సంబంధించిన వివరాలు తెలియలేదు. ఇప్పటికే విమానాశ్రయానికి భూమలిచ్చిన రైతులు ఈ రహదారితో ఇంకా విలువైన భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు.

రైతులు కోల్పోనున్న భూములు ఇవే

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు అడ్డగింత

● దళితవాడలో ఉన్న స్థలం తమదంటూ పెత్తందారుల బుకాయింపు ● ఇక్కడ విగ్రహం, కమ్యూనిటీ హాలు వద్దంటూ పనులు నిలిపివేత

ప్రజాశక్తి - సంతకవిటి

తరాలు మారినా, దళితుల తలరాతలు మారడం లేదు. సమాజంలో అదే వివక్ష, అదే చిన్న చూపు ఇంకా కొనసాగుతుంది. ఈ వివక్షను రుజువు చేస్తూ మండలంలోని మండవకురిటి గ్రామంలో ఆదివారం ఓ సంఘటన చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన దళితలు తమ దళితవాడను ఆనుకుని ఉన్న ప్రభుత్వ డీ పట్టా భూమిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా విగ్రహ ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హాలు నిర్మించాలని భావించి పునాదులు తీసేందుకు సిద్ధమయ్యారు. దీంతో అదే గ్రామానికి చెందిన పెత్తందారులు ఆ స్థలం తమదని ఇక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయవద్దని అడ్డుతగిలారు. దీంతో దళితులు, పెత్తందారుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈ డీపట్టా స్థలం దళితువాడలో 30 ఏళ్లుగా నిరూపయోగంగా ఉండడంతో దళిత యువకులు, అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. అయితే ఆ స్థలం తమదని అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మిస్తే ఊరుకోమంటూ పెత్తందారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తమ పొలాలను ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ డీ పట్టా స్థలాన్ని కబ్జా చేసేందుకు అగ్రకులాలు వారు ప్రయత్నిస్తున్నారు. 30ఏళ్ల క్రితం ఎస్‌సి కాలనీ కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే తాము విగ్రహ ఏర్పాటుకు పూనుకున్నామని దళితులు చెబుతున్నారు.

ఘర్షణ పడుతున్న ఇరు గ్రూపుల సభ్యులు

తూతూ మంత్రంగానే సర్వే

చాలా కాలంగా ఈ వివాదం నలుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కచ్చితంగా సర్వే చేసి నిజనిర్ధారణ చేయడం లేదని దళితులు వాపోతున్నారు. గతంలో జిల్లా సర్వేయర్‌తో పాటు, మండల సర్వేయర్, విఆర్‌ఒలు కూడా ఘటన స్థలాన్ని పరిశీలించి తూతూ మంత్రంగా వచ్చి వెళ్లిపోయారు. అధికారులు గ్రామంలోకి వచ్చినప్పటికే పెత్తందారులు తప్పుడు పత్రాలను సృష్టించి అధికారులకు చూపించారని ఆరోపిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఇది ఎవరికి చెందుతుందో తేల్చడం లేదన్నారు. ఇప్పటికైనా సమగ్రంగా దర్యాప్తు చేసి ఆ భూములు దళితులకు చెందివని నిర్ధారిస్తే కాలనీలో పెళ్లిల్లు, ఇతర శుభకార్యాలకు అనుకూలంగా ఒక కమ్యూనిటీ హాలు, అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని చెబుతున్నారు. ఈ విషయంపై రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో www.cse.gov.in, www.apms.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని చెప్పారు. ఒసి, బిసి కులాలకు చెందిన విద్యార్థులు 1-09-2013 నుంచి 31-08-2015 మధ్య పుట్టినవారై ఉండాలని, ఎస్‌సి, ఎస్‌టి కులానికి చెందిన విద్యార్థులు 1-09-2011 నుండి 31-08-2015 మధ్య పుట్టి ఉండాలని చెప్పారు. ఒసి, బిసిలకు పరీక్షా రుసుము రూ. 150 కాగా ఎస్‌సి, ఎస్‌టిలకు రూ. 75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా జరుగుతాయని తెలిపారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రమైన వేపాడ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామకంఠాలు, చెరువు గట్లు ఆక్రమించుకుని, పుట్టగొడుగుల్లా నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆక్రమణలపై తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు గొర్లె శ్రీను, కిమిడి దేముడు, జి.ఎ.నాయుడు, ఎస్.శ్రీను, కిమిడి అప్పారావు, జి.నాగేషు, గోకాడ సత్యం, వై.అప్పారావు, గుడివాడ సూరిబాబు, ఎస్.పరదేశి, యు.దేవుడునాయుడు, జె.అప్పారావు, వి.గోవింద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడుతున్న బడా నాయకుడిని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సారిపల్లి ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివపంచాక్షరీ మహా మంత్ర అఖండ నామసప్త సప్తాహం'49 రోజులు కార్యక్రమానికి స్వామి కంటి ఆసుపత్రి డాక్టర్ మంచు కుమారస్వామి భారతి దంపతులు అన్నదానం నిమిత్తం రూ. 50వేలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆ దంపతులు ఆదివారం అందించినట్లు భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి దేవస్థానం కమిటి సభ్యులు తెలిపారు.

ఊరూరా బెల్టు షాపులే!

● లక్షల్లో వేలం పాటలు
● పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో పలు గ్రామాల్లో మద్యం బెల్ట్ షాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టికొచ్చాయి. మంచినీటి కొరత ఉన్న గ్రామాలు ఉన్నాయి గానీ మద్యం కొరత ఉన్న గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. ప్రతి గ్రామంలో మద్యం విక్రయాలకు వేలం పాటలు నిర్వహించి మరీ అమ్మకాలు చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విక్రయాలను సులభతరం చేయడంతో విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టికొచ్చాయి. ప్రభుత్వానికి మద్యం ప్రధాన ఆదాయ వనరుగా భావించడంతో సడలింపులు కూడా అధికంగా ఉంటాయని భావించిన చాలా మంది పెద్దలు గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణకు వేలం పాటలు నిర్వహిస్తున్నారు.

లక్షల్లో వేలం పాటలు

గ్రామాల్లో మద్యం అమ్ముకునేందుకు వీలుగా పంచాయతీలే ముందుకు వచ్చి వేలం పాటలు నిర్వహిస్తున్నాయి. ఆయా గ్రామాల పరిస్థితిని బట్టి ఒక్కొక్క గ్రామానికి 3లక్షల నుంచి 8, 10 లక్షల రూపాయలు వరకు వేలం పాటలో బెల్ట్ షాప్‌లు దక్కించుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా పారసాంలో రూ.6లక్షలు, చిన బూరాడపేటలో రూ.4 లక్షలు, తంగుడుబిల్లిలో రూ.3లక్షలకు వేలం పాట జరిగినట్లు సమాచారం. వేలం పాటలో బెల్టుషాపును దక్కించుకున్న వ్యక్తి ఒక్కొక్క బాటిల్‌పై రూ. 20 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. దీనికి పంచాయతీలు కూడా అంగీకరించినట్లు తెలిస్తోంది. ఎన్నికల్లో ఎన్ని గొడవలున్నా మద్యం వేలం పాటకు మాత్రం మూడు పార్టీల నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలిస్తోంది.

పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరో సమాచారమిస్తే తప్ప కార్యాలయం నుంచి కాలు బయటకు పెట్టడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఒకవేళ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నా నాయకులు ఫోన్ చేయగానే వదిలేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా గతంలో ప్రభుత్వ మద్యం షాపుల నుంచి బెల్టుషాపులకు పరిమితంగా మద్యం తరలించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. నేరుగా ప్రభుత్వం మద్యం షాపునకు చెందిన వ్యక్తే నేరుగా గ్రామాల్లోని బెల్టుషాపులకు మందు సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు, దీనికి భారీ ముడుపులు అందుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు మామ్మూళ్ల మత్తు వదిలి గ్రామాల్లో బెల్టుషాపులను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

'చీకటి పువ్వు'కు ప్రథమ బహుమతి

● ద్వితీయ బహుమతి దక్కించుకున్న కొత్త పరిమళం ●ఘనంగా ముగిసిన నాటిక పోటీలు

అవార్డులను ప్రదానం చేస్తున్న నాయకులు, గ్రామ పెద్దలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో గత మూడు రోజుల పాటు జరిగిన ఆరిపాక బ్రహ్మానందం స్మారక రెండు రాష్ట్రాల నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటికకు లభించింది. కాగా తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖ పట్నం తెలుగు కళా సమితి కళాకారులు ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక నిలిచింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, టిడిపి నాయకులు అవనాపు సత్యనారాయణ, గ్రామ పెద్దలు చేతులు మీదుగా అందజేశారు. ఉత్తమ దర్శకుడు బహుమతి మంచాల రమేష్ (చీకటి పువ్వు), ఉత్తమ రచయిత బహుమతి కెకెఎల్ స్వామి (కొత్త పరిమళం), ఉత్తమ నటుడు బహుమతి పి.వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత)కు లభించాయి. ద్వితీయ ఉత్తమ నటుడుగా డి.గిరిబాబు (చీకటి పువ్వు), ఉత్తమ నటిగా జి.లహరి (చీకటి పువ్వు), ద్వితీయ ఉత్తమ నటిగా డి హేమ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత) ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా రాంబాబు (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ సహాయ నటుడుగా శోభన్ బాబు(కొత్త పరిమళం), ఉత్తమ విలన్ గా దలం (కొత్త పరిమళం), ఉత్తమ హాస్యనటుడుగా బి.కన్నబాబు (నిశ్శబ్దమానీ ఖరీదెంత) కు బహుమతులు లభించాయి. అతిథులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కుసుమాల నాగభూషణం, కె.వి మంగారావు, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎంఎం నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, తుమ్ము వెంకటరమణ, కిల్లంపల్లి రామారావు, జన ప్రసాద్, మద్దిల సన్యాసిరావు, కాళ్ళ రాజశేఖర్, డొంక కృష్ణ, మద్దిల వాసు, ముత్యాల నాయుడు, కనకల హైమావతి నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఈపు విజయకుమార్, ఆరిపాక శ్రీనివాసరావు,ఆరిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లలితకుమారికి వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- లక్కవరపుకోట

జీడి రైతుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని జీడి రైతుల సంఘాలు, సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జీడి రైతు సంఘాలు, సిఐటియు నాయకులు ఆమెను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగ జిల్లా జీడి రైతు సంఘ కార్యదర్శి గొంప కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో జీడి రైతు కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. జీడి రైతుకు గిట్టుబాటు ధర లేదని, 80 కేజీల బస్తాకు రూ.16వేలు మద్దతు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాలు, గిరిజన కార్పొరేషన్ ప్రభుత్వ రంగ సంస్థలు ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. జీడి పండ్ల నుంచి రసం తీసే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో 1.83 లక్షల హెక్టార్లు సాగు పంట ఉందని, ఈ పంటపై రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ పంట అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, తరని వెంకటరమణ, అయ్యన్న శ్రీను పాల్గొన్నారు

స్టాపర్లు, సోఫాలు వితరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక పోలీస్ స్టేషన్‌కు క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం స్టాపర్లు , త్రీ షీటర్స్ సోపాలు వితరణ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు కంపెనీ డివిజనల్ మేనేజర్ వెంకటరమణ, లైజనింగ్ ఆఫీసర్ రమేష్, బిఎం తిరుపతి రావు అందించారు. ట్రాఫిక్ నియంత్రణకు ఐదు స్టాపర్లు, ప్రజల సౌకర్యం కోసం త్రీ షీటర్స్ సోపాలు నాలుగు అందించారు. బారికేడ్లు ట్రాఫిక్ నియంత్రణకు దోహదం చేస్తాయని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు.

గజపతినగరం: పోలీసు స్టేషన్‌కు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు 2 స్టీల్ షోపాలు, 5 బారికేడ్లు అందించినట్లు ఎస్.ఐ కె. లక్ష్మణ్‌రావు తెలిపారు. డివిజనల్ మేనేజర్ వెంకట రమణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 62 బ్రాంచ్‌ల పరిధిలో పోలీసు స్టేషన్లకు, ప్రభుత్వ ఆసుపత్రులకు, అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తువులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ లైజనింగ్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏరియా మేనేజర్ చక్రధర్ రావు, బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి, స్థానిక బ్రాంచ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: బారికేడ్లు, సోఫాలను అందిస్తున్న నిర్వాహకులు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి- మెంటాడ

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా, విజ్ఞాన శాస్త్ర ప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కెజిబివి పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవివి జాతీయ నాయకులు గంద్రేటి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు ఆనంద్, జిల్లా నాయకులు పంపాన రామారావు, జెవివి రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ గంద్రేటి శ్రీనివాసరావు(డప్పు శ్రీను), కెజిబివి ఉపాధ్యాయులు వాణి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఒ 117ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వం వెంటనే 117 జీవోను ఉపసంహరించి విద్యారంగ పరిరక్షణ చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయారాజు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి కోరారు. ఆదివారం స్థానిక శాఖా కార్యాలయంలో వారు మాట్లాడుతూ జీవో 117 ఉపసంహరణ చేసే క్రమంలో 3,4,5 తరగతులను కిలోమీటరు లోపు ఉన్న మోడల్ ప్రైమరీ స్కూలుకు పరిమితం చేయాలన్నారు. 60 మంది కన్నా తక్కువ ఉన్న యుపి స్కూల్ విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు విలీనం చేయకుండా యుపి స్కూల్లను యథాతథంగా స్కూల్ అసిస్టెంట్ల పాటర్న్‌తోనే కొనసాగించాలన్నారు. ఇది జరగకపోతే రవాణా సౌకర్యం లేని కారణంగా ఆ విద్యార్థులు డ్రాప్ అవుట్స్ అయ్యే అవకాశం ఉందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యా బోధనకు ఇంటర్ అర్హతతో పాటు టీచర్ ట్రైనింగ్ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారికే అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా అధ్యక్షులు బలరాం నాయుడు, కార్యవర్గం నేతలు పైడిరాజు, కృష్ణ, మదు, స్థానిక మండల శాఖ అధ్యక్షులు రవికుమార్, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు

కుక్కలను నివారించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో కుక్కలను నివారించాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వెంటనే నివారించాలని కోరారు. ముఖ్యంగా మొయిద జంక్షన్, థామస్‌పేట, లక్ష్మీదేవిపేట, జరజాపుపేట ప్రాంతాల్లో కుక్కలు పదాచారులు, వాహన దార్లపై దాడికి పాల్పడుతున్నాయని తెలిపారు. వేకువ జామున పనులకు వెళ్లే కార్మికులు, పొలం పనులు, భవన నిర్మాణం పనులు చేసుకొనే కూలీలు వీటి బారిన పడి గాయాలకు గురై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తిరిగి పనులు చేసుకొని సాయంత్రం వచ్చే వారిమీద కూడా కుక్కలు దాడి చేసి కరుస్తున్నాయని సంబంధిత అధికార్లు వెంటనే స్పందించి నివారించాలని కోరారు.